సాక్షి
ములుగు

గురువారం । 3 । అక్టోబర్ । 2024

ఏటూరునాగారం: రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఒక్కేసి పువ్వేసి చందమామ..

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం సమయంలో ఆలయాలు, చెరువు కట్టల వద్దకు బతుకమ్మలతో చేరుకున్న మహిళలు, యువతులు, చిన్నారులు ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము ఆయే చందమామ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లోని మహిళలు, యువతులు, చిన్నారులు శివాలయానికి చేరుకుని ఆటపాటలతో పాటు కోలాటాలతో సందడిగా బతుకమ్మ ఆడారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో శివాలయం కిక్కిరిసిపోయింది. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – ములుగు

- మరిన్ని ఫొటోలు 11లో ▶

ములుగు: బతుకమ్మలతో శివాలయానికి చేరుకుంటున్న మహిళలు, యువతులు







శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

న్యూస్‌రీల్

స్వచ్ఛ భారత్



ములుగు రూరల్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ ఇంచర్ల వారి ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 39వ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్ వాస్తవ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామప్ప దేవాలయం, వెంకటాపురం పోలీస్ స్టేషన్, గాంధీ సెంటర్‌లో చెత్తను ఏరివేసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ రజిత, అసిస్టెంట్ కమాండెంట్ నారాయణ తుకారాం, అధికారులు, జవానులు పాల్గొన్నారు.

ఎంపీఓ రహీమొద్దీన్‌కు అరుదైన గౌరవం



ములుగు: ములుగు ఎంపీఓ రహీమొద్దీన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో ప్రధాని మోదీ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశానికి రాష్ట్రం తరఫున ఎంపీఓకు పిలుపువచ్చింది. దీంతో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశానికి రహీమొద్దీన్ హాజరయ్యారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినందుకు తనను గుర్తించి సమావేశానికి ఎంపికయ్యేలా చేసిన మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకరకు రహీమొద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీ ఫలితాల్లో అశోక్‌కు రెండు ఉద్యోగాలు



గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2024 డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధిలోని పాట్లాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అశోక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండు ఉద్యోగాలను ఏక కాలంలో సాధించారు. 2024లో నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 74.20 మార్కులతో జిల్లా రెండో స్థానంలో, తెలుగు పండింట్‌లో 77.20 మార్కులతో జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచి ఏకకాలంలో రెండు ఉద్యోగాలు సాధించి అందరికి ఆదర్శంగా నిలించారు. ఈ సందర్భంగా అశోక్‌ను ఉపాధ్యాయులు, మిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

చెట్టుపై చలి పిడుగు



ములుగు రూరల్: మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామంలో చలి పిడుగు పడింది. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మల్లంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చెట్టుపై చలి పిడుగు పడింది. ఈ క్రమంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వృద్ధులకు అండగా నిలవాలి



భూపాలపల్లి అర్బన్: వయస్సు పైబడిన పెద్దలను ప్రేమతో చూసుకొని అండగా నిలవాలని జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు తెలిపారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. వృద్ధులు ప్రేమ, మర్యాద, ప్రశాంతతను తప్ప ఏమి ఆశించరన్నారు. వారికి మనో ధైర్యాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ సంపత్, నిర్వాహకులు శైలజ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన డెన్‌లో సర్వమత ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీడర్స్, స్కౌట్స్ గైడ్స్, రోవర్స్ సంజీవరావు, శ్రీనివాసరావు, స్వామి, రేణుక, సూర్య, రాజమౌళిలు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

రేపటి నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ

- తొలుత జాకారం చెరువులో వదలనున్న మంత్రి సీతక్క
- జిల్లాలో రెండు రిజర్వాయర్లు, మూడు ప్రాజెక్టులు, 484 చెరువులు

ములుగు: మత్స్యకారులు, సొసైటీలకు ఆర్థిక భరోసానిచ్చే చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారు అయ్యింది. రేపు(శుక్రవారం) రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ములుగు మండలం జాకారం ఊరచెరువులో చేపపిల్లలను వదిలి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. సాధారణంగా వర్షాలు కురిసి చెరువులు నిండగానే ఆగస్టు రెండో వారం నుంచి సెప్టెంబర్ తొలి వారంలో చేపపిల్లల పంపిణీ జరిగేది. అయితే ఈ సారి టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో సకాలంలో చేపపిల్లలను చెరువుల్లో వదల్లేకపోయారు. అయితే ఇప్పటికే చెరువులు నిండి ఉన్నాయని, ఇక ముందు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో చేప పిల్లలు ఎదగడానికి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.

రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో పెద్దసైజు పిల్లలు

జిల్లాలో రామప్ప, లక్నవరం రిజర్వాయర్లు, పాలెం, మల్లూరు, సమ్మక్క బ్యారేజ్ ప్రాజెక్టులు, మరో నాలుగు పెరినియల్ ట్యాంక్‌లలో 80 నుంచి 100 మిల్లీమీటర్లు ఉన్న పెద్దసైజు చేప పిల్లలు వదలనున్నారు. బొచ్చె, మెరిగే, రవ్వ రకానికి చెందిన ఫిగర్లింగ్ సైజు 69,68,778 చేప పిల్లలు రిక్వర్‌మెంట్ ప్రకారం జిల్లాకు కేటాయించబడ్డాయి. మరో 484 చెరువుల్లో (54 సొసైటీ చెరువులు)35నుంచి 40 మిల్లీమీటర్ల సైజు ఉన్న 1,57,18,926 చేప పిల్లలను వదలనున్నారు. ఇందులో బొచ్చె, రవ్వ, బంగారు తీగ రకాలు ఉన్నాయి.



చేప పిల్లలు మత్తడి దాటే అవకాశం లేదు..

ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు జోరుగా ఉంటాయి. చెరువులు మత్తళ్లు పడతాయి. ప్రతీఏటా అంతకు ముందే చేప పిల్లలు వదలడంతో మత్స్యకారులు మత్తడికి అడ్డంగా వలలు వేసి ఉంచినా చిన్నచిన్న రంధ్రాల నుంచి 35–40 మిల్లీమీటర్లు ఉన్న చేప పిల్లలు వరదలో కిందికి జారేవి. ఇది మత్స్యకారులకు ఇబ్బందికరంగా మారేది. ఈ సారి కాస్త లేటుగా అక్టోబర్‌లో చేప పిల్లలు వదలనుండడంతో ఆ సమస్యకు చెక్ పడినట్లువుతుంది. అనుకోని విధంగా మూడు, నాలుగు రోజులు వర్షాలు పడితే తప్పా చెరువులు 100శాతం నిండి మత్తళ్లు పడే అవకాశం లేదు.

జిల్లాలోని సొసైటీలు

మండలం	సొసైటీలు
ములుగు	11
వెంకటాపురం(ఎం)	11
గోవిందరావుపేట	3
ఎస్‌ఎస్ తాడ్వాయి	11
ఏటూరునాగారం	4
మంగపేట	2
వాజేడు	3
వెంకటాపురం	2
కన్నాయిగూడెం	7

చేప పిల్లలను వదలడానికి సిద్ధం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో చేప పిల్లలను వదలడానికి సిద్ధంగా ఉన్నాం. రేపు(శుక్రవారం) మంత్రి డాక్టర్ సీతక్క చేతుల మీదుగా ములుగు మండలంలోని జాకారం ఊర చెరువులో చేప పిల్లలను వదిలి కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. తదనంతరం ఆయా చెరువుల్లో బొచ్చె, రవ్వ, బంగారుతీగ, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో బొచ్చె, మెరిగె, రవ్వ రకాలను వదలనున్నాం. ఈ విషయమై సొసైటీలు, మత్స్య కమిటీలకు సమాచారం అందించాం.

– అవినాష్, జిల్లా ఇన్‌చార్జ్ మత్స్యశాఖ అధికారి

నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు

ఏటూరునాగారం: నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు నేటి నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న క్రమంలో రోజుకో తీరుగా అమ్మవారిని అలంకరించనున్నారు. నేడు(బుధవారం) అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, కన్యకాపరమేశ్వరి నిర్మాణ ఆలయ స్థలం, క్రాస్‌రోడ్డు, శివాలయం ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించనున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా పాట్లాపూర్, పంబాపూర్



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ములుగు అసెంబ్లీ నియోజకవర్గం కింద డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు ములుగు మండలంలోని పాట్లాపూర్, ఎస్‌ఎస్ తాడ్వాయి మండలంలోని పంబాపూర్‌లను కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ రెండు గ్రామాలలో నేటి(గురువారం) నుంచి సర్వే ప్రారంభమై 8వ తేదీన ముగియనుంది. ఆయా మండలాల ఎంపీడీఓల సమక్షంలో అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్త వంటి స్థానిక ఉద్యోగులను బృందం సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ మేరకు కలెక్టర్ దివాకర, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండు బృందాలకు డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేలో సేకరించాల్సిన పట్టికను వివరించారు. చార్ట్‌లోని అంశాలను ఏ విధంగా సేకరించాలనే దానిపై అవగాహన కల్పించారు. మహిళను హెడ్ ఆఫ్‌ది ఫ్యామిలీగా చేర్చి మిగతా కుటుంబ సభ్యుల పేర్లు, జెండర్, వయస్సు, ఆధార్‌కార్డు వంటి వివరాలను చార్ట్‌లో పొందుపరుస్తారు. అధికారులకు సర్వే సమయంలో ఎదురైన అనుభవాలను నివేదిక రూపంగా ప్రభుత్వానికి అందజేయనున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



భూపాలపల్లి అర్బన్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. 107 మంది ఎస్జీటీ ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరిశీలన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారులు సిబ్బంది రాజగోపాల్, భద్రయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని రాస్తారోకో



సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రం నుంచి ఎదిర వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై యువకులు బుధవారం రాస్తారోకోకు దిగారు. మండల కేంద్రం నుంచి ఎదిర వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా కాంట్రాక్టర్ నేటి వరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై మెటల్ పోసి వదిలి పెట్టడంతో రోడ్డు పై వాహనాల రాకపోకలతో దుమ్ము విపరీతంగా వస్తుందని తెలిపారు. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని యువకులు కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను తొలగిస్తున్న జీఎం, అధికారులు

భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి గనులపై సోమవారం స్వచ్ఛతా హీ సేవా 4.0 కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం రామప్పకాలనీ ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సెన్ స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేపట్టారు. ముందస్తుగా నిర్దేశించిన పని స్థలాల్లో అధికారులు, కార్మికులు పాల్గొని గని ప్రదేశాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, జ్యోతి, మారుతిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత సంస్కార్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు హజరై పరిసరాలను పరిశుభ్రం చేసి పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, పాలకవర్గ సభ్యులు, అధికారులు ముంజాల రవీందర్, సునీల్, ఆశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు (గురువారం) వేలం నిర్వహించనున్నట్లు భూపాలపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రమ్యరెడ్డి తెలిపారు. భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటలకు వేర్వేరు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 35 వాహనాలకు వేలం నిర్వహించడం జరుగుతుందని, ఈ వాహనాల వేలంలో పాల్గొనేవారు ధరావత్తుగా 50 శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించి, మిగిలిన సొమ్మును వాహనం పొందిన తర్వాత అదే రోజు చెల్లించాలన్నారు.

గాంధీజీ ఆదర్శప్రాయుడు

కలెక్టర్ టీఎస్.దివాకర



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు: జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఈ మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌తో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ శాంతి మార్గాన్ని అనుసరించి దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ డాక్టర్ శబరీశ్ నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన శాంతియుత పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బీ గీతే, ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ శబరీశ్

బలహీన వర్గాలకు అండగా ఉంటాం..

కాటారం: కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలిచి ఆవిర్భావం నుంచి అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ అన్నారు. కాటారం మండల కేంద్రంలో కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. కేవీపీఎస్ జెండాను ఎగరవేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కుల వివక్షను రూపు మాపి బలహీన వర్గాలకు అండగా నిలవడమే కేవీపీఎస్ లక్ష్యమన్నారు. ఎవరైన కులవివక్షకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని మహేందర్ తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న అధికారులు

రేగొండ: పరిశుభ్రమైన, పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా అటవీ అధికారి వసంత అన్నారు. బుధవారం మండలంలోని తిరుమలగిరి శివారులోని జియో టూరిజం సైట్ పాండవులగుట్ట వద్ద జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పరిశుభ్రత కార్యక్రమం నిరంతర చొరవ అని ఇది వారి ఇళ్ల నుంచి పని ప్రదేశాల వరకు విస్తరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ నాగరాజు, జీఎస్ఐ డైరెక్టర్లు అనిల్ కుమార్, సచిన్, శాస్త్రవేత్తలు సామల రమేష్, గుండా రమేష్, గౌతమి, చిరంజిత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోణార్క్, సాయినగర్ రైళ్ల దారి మళ్లింపు

● అక్టోబర్ 7వ తేదీ వరకు కొనసాగింపు

కాజీపేట రూరల్: కాజీపేట–విజయవాడ–బల్లార్షా సెక్షన్లలో రైల్వే మూడో లైన్ పనులు, ఇంజనీరింగ్ వర్క్‌తో పలు రైళ్లను రద్దు, దారి మళ్లించి, రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. గత నెల 26వ తేదీన ప్రారంభమైన రైల్వే పనులు ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్నట్లు వివరించారు. కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే భువనేశ్వర్–ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) అక్టోబర్ 6వ తేదీ వరకు, సాయినగర్–కాకినాడ (17205) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీ వరకు, కాకినాడ–సాయినగర్ (17206) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5,7వ తేదీ వరకు కాజీపేట జంక్షన్‌కు రాకుండా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మళ్లించారు. ఆదిలాబాద్–తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీ వరకు సికింద్రాబాద్, గుంటూరు మీదుగా తిరుపతికి మళ్లిస్తున్నట్లు వారు తెలిపారు. వరంగల్‌లో 4 రోజులు, కాజీపేట ఎఫ్ క్యాబిన్ వద్ద 9 రోజులు, హసన్‌పర్తి వద్ద 4 రోజుల రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ వర్క్ కారణంగా కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 98 రైళ్ల రద్దు, 59 రైళ్లను దారి మళ్లింపు, 29 రైళ్లు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. కాగా, రైళ్ల రద్దు, దారి మళ్లింపు, రీషెడ్యూల్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రైల్వే ఎంక్వైరీ ద్వారా, రైల్వే యాప్‌ల ద్వారా సమయ వివరాలను తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. కొందరు రిజర్వేషన్ రద్దు చేసుకుంటున్నారు.

పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారని..

● పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం


108 వాహనంలో రాజు

గణపురం: తన తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన మోటపోతుల రాజు గ్రామంలో పలువురు వద్ద అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి రాజు తల్లిదండ్రులను తీర్చమని అడుగుతున్నారు. దీంతో రాజును తల్లిదండ్రులు మందలించారు. ఈ ఘటనపై రాజు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. దీంతో రాజు తండ్రి సమ్మయ్య బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. ఆందోళనకు గురైన రాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో రాజును ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్సై తెలిపారు.

ఎదురుచూపులు ఎంతకాలం?

జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఆవేదన

● 2023 మార్చి 31న నియామకాలకు నోటిఫికేషన్
● 2023 జూన్ 4న రాత పరీక్ష..
● ఈ ఏడాది ఆగస్టు 1న ఫలితాలు వెల్లడి, 22న సర్టిఫికెట్ల పరిశీలన
● ఇప్పటికీ అందని నియామక ఉత్తర్వులు
● జాప్యం చేస్తున్న టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం



హన్మకొండ : వారంతా 16 నెలల క్రితం పరీక్ష రాశారు. ఇందులో ఉత్తీర్ణులయ్యారు.. పైగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేయించుకున్నారు. అయినా నియామక ఉత్తర్వులు అందడం లేదు. ఫలితంగా ఉద్యోగంలో చేరేదీ ఎప్పుడెప్పుడా అని వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. వారే టీజీ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు. కాగా, సెప్టెంబర్ 30న డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం.. ఈ నెల 9న ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించనుంది. ఫలితాలు విడుదల చేసిన 10 రోజుల్లోనే డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తుండగా.. ఆగస్టు 1న ఫలితాలు విడుదల చేసి అదే నెల 22న సర్టిఫికెట్లు పరిశీలన జరిపినా ఇప్పటి వరకూ టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంలో ఆంతర్యమేమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు..

మరో వైపు ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ మేరకు ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. అయినా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్టుల భర్తీలో వేగం కనిపించడం లేదు. 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్టుల భర్తీకి యాజమాన్యం 2023 మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 2023 మే 28న జరగాల్సిన రాత పరీక్ష వివిధ కారణాలతో వాయిదా వేశారు. తిరిగి 2023 జూన్ 4న హైదరాబాద్ కేంద్రంగా రాతపరీక్ష నిర్వహించారు. ఫలితాలు వెల్లడిలో తీవ్ర జాప్యం జరిగింది. నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. తర్వాత కొద్ది రోజులకు ఎన్నికలు రావడంతో పాటు రాష్ట్రంలో మార్పు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియను 65 రోజుల్లో పూర్తి చేసింది. అయితే ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు రాత పరీక్ష జరిగి 16 నెలలు గడుస్తున్నా నేటికీ నియామక ఉత్తర్వులు అందించడంలో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

14 నెలలకు ఫలితాలు విడుదల

రాత పరీక్ష జరిగిన 14 నెలలకు ఫలితాలు విడుదల చేసి అర్హుల జాబితా విడుదల చేసిన యాజమాన్యం.. సర్టిఫికెట్ల పరిశీలన జరిపి 41 రోజులు గడుస్తున్న నేటికీ నియామక పత్రాలు అందించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇతర శాఖల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతుండగా ఎన్పీడీసీఎల్‌లో ఆలస్యమైన కొద్దీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. మరో వైపు సిబ్బంది కొరతతో ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరిగింది. దీంతో వారు కూడా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల భర్తీ జరగాలని భావిస్తున్నారు.

తీవ్రంగా వేధిస్తున్న ఉద్యోగుల కొరత..

మరో వైపు రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్ల పునర్విభజన జరిగింది. ఈ మేరకు పోస్టులు మంజూరు కాకపోవడంతో ఉన్న వారినే సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో ఆయా కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఉద్యోగాల భర్తీ ఆలస్యం అవుతుండడంతో పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమైన ఎన్పీడీసీఎల్ జాయింట్ సెక్రటరీ రమేశ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా రెండు, మూడు రోజుల్లో నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, సమాజంలో మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మాయాంక్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ, స్థానిక ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడానికి దోహదపడతారని పేర్కొన్నారు. అంతకు ముందు మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీఓ అవినాశ్, డీపీఓ నారాయణరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మహదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి


కల్యాణి(ఫైల్)

చెన్నారావుపేట: డెంగీ జ్వరంతో ఓ విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెం దేవేందర్ – రమ దంపతుల కూతురు కల్యాణి(20) ప్రభుత్వ ఉద్యోగాల కోసం హైదరాబాద్ అమీర్‌పేటలో కోచింగ్ తీసుకుంటుంది. ఇటీవల జ్వరం రావడంతో వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. జ్వరం తక్కువైనట్లు అనిపించడంతో హనుమకొండలోనే బంధువుల ఇంటికి వెళ్లారు. మళ్లీ జ్వరం రావడంతో ఎంజీఎం తీసుకెళ్లారు. ఎంజీఎం వైద్యులు డిశ్చార్జి చేయకముందే వెళ్లారని కోపం చేశారు. దీంతో వారు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామానికి చెందిన వ్యాపార వేత్త పులి దేవేందర్, గ్రామ పెద్దలు పెరుమాండ్ల లక్ష్మారెడ్డి, వట్టె రాంరెడ్డి, పరికి మధూకర్, భాషమియా, ఉమారెడ్డి.. కల్యాణి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చదువుకున్న పాఠశాలకే హెచ్‌ఎం..

● ఓ టీచర్‌కు దక్కిన అరుదైన అవకాశం


గార్ల బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుందర్‌కుమార్

గార్ల: ఓ ఉపాధ్యాయుడు చిన్నప్పుడు తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకే ప్రస్తుతం హెడ్‌మాస్టర్ అయ్యాడు. దీంతో సహ ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించి అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. గార్లకు చెందిన మాచర్ల సుందర్ కుమార్ తన చిన్నప్పుడు గార్లలోని యూపీఎస్, హైస్కూల్లో చదువుకున్నాడు. యూపీఎస్ ప్రస్తుతం బాలికోన్నత పాఠశాల అయ్యింది. ఈ క్రమంలో గత నెల 30వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం రత్నకుమార్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సీనియారిటీ ప్రకారం ఇదే మండలంలోని పెద్దకిష్టాపురం పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాచర్ల సుందర్‌కుమార్ జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మంగళవారం గార్ల బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు.

పర్యావరణ రక్షణకు వాసవీక్లబ్ కృషి

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి


సీడ్‌బాల్స్‌తో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వాసవీ క్లబ్ బాధ్యులు, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్ : పర్యావరణ రక్షణకు వాసవీ క్లబ్‌లు కృషి చేస్తున్నాయని, 20వేల సీడ్‌బాల్స్ తయారు చేయించి పర్యావరణానికి జీవం పోస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులతో ఇటీవల సీడ్‌బాల్స్ తయారు చేయించారు. వివిధ రకాల విత్తనాలతో తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను క్యాంపస్‌లోని పలుప్రాంతాల్లో బుధవారం వెదజల్లారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. పర్యావరణ రక్షణలో వాసవీ క్లబ్ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, వాసవీ క్లబ్ బాధ్యులు, కేయూ పాలకమండలి సభ్యులు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవతావాదానికి ప్రతీక గాంధీ

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ : స్వచ్ఛత, ఆత్మ నిర్భరత, మానవతావాదానికి ప్రతీక గాంధీ అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతిని జరుపుకున్నారు. గాంధీ చిత్రపటానికి సీఎండీ, డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు కె.రాజు చౌహాన్, కె.కిషన్, రవీంద్ర నాథ్, అశోక్, కె.ఎస్ గుట్ట, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు సస్పెన్షన్

● మరో ఇద్దరు ఉద్యోగులు కూడా..
● కాంట్రాక్టు ఉద్యోగి టర్మినేషన్
● కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు


రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న ఏఆర్ అశోక్‌బాబు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూమిలో ఇళ్లు నిర్మించారని హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును సస్పెండ్ చేస్తూ కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 229 సర్వేనంబర్ భూమిలో అశోక్‌బాబుతో పాటు మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఓ కాంట్రాక్టు ఉద్యోగి గృహాలు ఉన్నట్లు సర్వే రిపోర్టు ద్వారా వెల్లడైంది. దీంతో మల్లారెడ్డి, ఏఆర్ అశోక్‌బాబుకు మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని మెమోను జారీచేశారు. అయితే సర్వేనంబర్ 235లో తన భార్య సుమతల పేరు మీద ఇళ్లు ఉందని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం కేయూలో గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తుండగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు అక్కడికి వచ్చారు. కార్యక్రమం అనంతరం రిజిస్ట్రార్‌కి ఇబ్బంది కలిగించే విధంగా వాగ్వాదం చేసి, న్యూసెన్స్ సృష్టించారని రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని అశోక్‌బాబు ఉల్లంఘించారని, ఇన్‌చార్జ్ వీసీ ఆదేశాల మేరకు అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు.

మరో ఇద్దరు ఉద్యోగులపై వేటు.. కాంట్రాక్టు ఉద్యోగి టర్మినేషన్

కేయూ క్యాంపస్‌లోని పబ్లికేషన్ సెల్‌లో వేయిటర్ విధులు నిర్వర్తిస్తున్న పి.ఎల్లస్వామి, బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న టి.బుచ్చయ్యను సైతం సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వీరితో పాటు జాతీయ సేవాపథకం యూనిట్‌లో కాంట్రాక్టు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.యాదగిరిని విధుల నుంచి టర్మినేషన్ చేస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

దోపిడీ దొంగల అరెస్ట్..

● వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి


నిందితుల అరెస్ట్ చూపుతున్న హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: ముగ్గురు దోపిడీ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 900 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేవన్నపేట ప్రాంతానికి చెందిన బాధితుడు సెప్టెంబర్ 30న మధ్యాహ్న సమయంలో దేవన్నపేటకు వెళ్లేందుకు కిరాయి ఆటో కోసం గోపాల్ పూర్ క్రాస్ వద్ద ఆగి ఉన్నాడు. ఈ క్రమంలో నిందితులు లష్కర్ సింగారం గ్రామానికి చెందిన జన్ను రాజ్‌కుమార్, పోచమ్మమైదాన్‌కు చెందిన కట్కూరి యాకూబ్, కట్కూరి రేణుక.. ఒక్కసారిగా వెనుక నుంచి వచ్చి బాధితుడుని తీవ్రంగా కొట్టారు. అనంతరం గుర్తు తెలియని ఆటోలో పోచమ్మ కుంట శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లి అక్కడ బాధితుడుని మరో మారు తీవ్రంగా కొట్టి అతడి వద్ద ఉన్న రూ. 10 వేల నగదు, సెల్‌ఫోన్ దోచుకోవడంతోపాటు గూగుల్ పే నుంచి రూ.వెయ్యి తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. ఈ ఘటనపై బాధితుడు హనుమకొండ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితులను హనుమకొండ బస్టాండ్ దగ్గర అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

సంస్కృతిని కాపాడుకుందాం..

● బతుకమ్మ సంబురాల్లో మంత్రి కొండా సురేఖ


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: తెలంగాణ సంస్కృతితిని, సంప్రదాయాలను కాపాడుకుందామని, మహిళా అభ్యున్నతికి సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం రాత్రి వరంగల్‌శివనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై మేయర్ గుండు సుధారాణితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.24 లక్షల వ్యయంతో రామాలయ అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేశ్, నవీన్, సాంబయ్య, రవికంటి అశోక్, అడెపు శ్యాం, కుడికాల సుధాకర్, బుధారపు భాస్కర్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOTS FOR SALE

■ ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237310]

ఫామ్ ల్యాండ్

■ నవరాత్రి ఇన్ఫ్రా వారి వరంగల్– ఖమ్మం హైవే ఉప్పరపల్లి క్రాస్ దగ్గర కొత్తగా మొదలవుతున్న 30 ఎకరముల ఫామ్ ల్యాండ్ వెంచర్ నందు ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్స్ కావలెను. ఆసక్తి గలవారు సంప్ర: +91 9392758621. [WA-7542]

COMMERCIAL RENT

■ Commercial space for Rent Ground & 1st Floor, with Parking 6128 x 2 Floors=12,256 sft. Hyder Manikanta Complex, Old Bus Depot Main Road, Near Thirumala Bar, Hanamkonda, Cont: 9542981472, 9440015246. [W-1239914]

SERVICES

FINANCIAL SERVICES

■ బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టూవీలర్ లోన్స్, ఫ్లాట్ లోన్ ఇప్పబడును. I.T. రిటర్న్స్, G.S.T, పాన్‌కార్డ్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185296]

WANTED

■ Wanted Lab Technician & M. Pharm / Pharm. D/B. Pharm. D/B. Pharm Graduate Female for Clinic in Hanamkonda Ph: 9494970980. [W-1239918]

■ మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V- 6570]

■ ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

● నిజామాబాద్‌పై కరీంనగర్..
● ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపు


గెలుపొందిన ఖమ్మం జిల్లా జట్టు క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 అంతర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం కొనసాగాయి. ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు విజయం సాధించాయి. కోమటిపల్లి గ్రౌండ్‌లో నిజామాబాద్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 వర్లకు 49.3 ఓవర్లు ఎదుర్కొని 192 పరుగుల స్కోరు చేసింది. కరీంనగర్ జట్టులో విఘ్నేష్ 55 పరుగులు, అఫ్రిది 35 పరుగులతో రాణించారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో కేవలం 74 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయింది. 118 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యింది. మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు కేవలం 29.3 ఓవర్లను ఎదుర్కొని 109 పరుగుల వద్ద అన్నీ వికెట్లను నష్టపోయింది. బ్యాట్స్‌మన్ సయ్యద్ 32 పరుగులు, స్మిత్ 24 పరుగులు చేయగా ఖమ్మం బౌలర్ నేహిత్ 5వికెట్లను సాధించాడు. అనంతరం 110 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఖమ్మం జట్టు రత్న ఆర్యన్ 43 పరుగులు, రాంపర్దన్ 29 పరుగులతో రాణించారు. 30.1 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 111 పరుగులు సాధించి 5 వికెట్ల తేడాతో విజయం సాధించారు. నేడు (గురువారం) మొగిలిచర్ల గ్రౌండ్‌లో ఆదిలాబాద్, కరీంనగర్ మధ్య, కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్ ఉంటుందని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చిన్నారిని కాటేసిన పాము

కాళేశ్వరం: చిన్నారిని పాము కాటేసింది. ఈ ఘటన బుధవారం రాత్రి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగింది. గ్రామానికి చెందిన పులి మోహన్ కాళేశ్వరం దేవస్థానం ఆవరణలో హోటల్ నిర్వహిస్తున్నాడు. తన కుమార్తె జాహ్నవి హోటల్‌లో కూర్చుంది. ఈ క్రమంలో ఫ్రిజ్ కింది భాగం నుంచి వచ్చిన పాము చిన్నారిని కాటు వేసింది. దీంతో తల్లిదండ్రులు వెంటనే భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు.

నిత్యం సంచారం!

దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ పరిధిలో చెత్త పేరుకుపోవడంతో నిత్యం పాములు సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆలయ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌లో సరైన వసతులు కల్పించడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

20 నిమిషాల్లో రూ. 29.70 లక్షల చోరీ

● ఒకే రోజు రెక్కీ.. అదే రోజు డబ్బులతో పరారీ
● బయ్యారం ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


సీన్ రీ–కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా ప్రధాన నిందితుడు గనిని ఏటీఎం వద్దకు తీసుకొస్తున్న పోలీసులు

బయ్యారం: చోరీలు చేయడమే వారి వృత్తి.. దీని కోసం ఎంత సాహసమైనా చేస్తారు. ఎంత దూరమైనా వెళ్తారు. రాష్ట్రాలు కూడా దాటి ప్రయాణం చేస్తారు. ఎంచుకున్న లక్ష్యాన్ని నిమిషాల్లో పూర్తి చేసి రాష్ట్ర సరిహద్దులు దాటడం ఆ ముఠా సభ్యులకు తేలికైన పని.. అయితే ఎంత తెలివిగా చోరీలకు పాల్పడినా ఆలస్యంగానైనా పోలీసులకు చిక్కారు. ఈ ముఠాలోని ప్రధాన వ్యక్తి అబ్దుల్‌గని సీన్ రీ–కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని రామాలయం సమీపంలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి పాల్పడడానికి రాజస్థాన్‌కు చెందిన నలుగురు దొంగల ముఠా పథకం వేసుకుంది. ఇందుకు ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతరకు పోలీసులు బందోబస్తుకు వెళ్లిన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 18 రాత్రి ఏటీఎంలో చోరీకి పాల్పడింది.

ఒకసారి రెక్కీ.. మరోసారి చోరీ..

ఫిబ్రవరి 17న రాత్రి 9.30 గంటలకు ముఠా సభ్యులు బయ్యారం ఎస్‌బీఐ ఏటీఎం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి కారులో జిల్లా కేంద్రానికి వెళ్లి అర్ధరాత్రి వరకు అక్కడే గడిపారు. సరిగా అర్ధరాత్రి 1.30 గంటలకు (ఫిబ్రవరి 18వ తేదీ) తిరిగి ఏటీఎం సమీపానికి వచ్చిన నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు తమ వెంట తీసుకొచ్చిన కట్టర్‌తో ఏటీఎంలోకి వెళ్లారు. ఆ తరువాత మరో వ్యక్తికి ఫోన్ చేయడంతో అతడు లోపలికి వెళ్లి షట్టర్ మూసివేశాడు. సరిగ్గా 20 నిమిషాలకే కట్టర్ సాయంతో ఏటీఎంలో రూ. 29.70 లక్షలు చోరీ చేశారు. అనంతరం గస్తీగా ఉన్న వ్యక్తిని కారుతో ఏటీఎం వద్దకు రావాలని సూచించారు. దీంతో కారు ఏటీఎం వద్దకు రాగానే నగదును కారులో వేసుకుని తిరిగి మహబూబాబాద్ వైపు బయలుదేరారు. అదే రోజు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ గుండా రాష్ట్ర సరిహద్దులు దాటారు.

నకిలీ ఆధార్‌తో పోలీసులకు చిక్కిన గని..

కరీంనగర్ జిల్లాలో పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో ప్రధాన నిందితుడు నకిలీ ఆధార్‌ను చూపించి తప్పించుకునే యత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు విచారణ నిర్వహించిన గనిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బయ్యారం పోలీసులు ఏటీఎం చోరీలో గని పాత్ర ఉందని నిర్ధారించుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గని తెలిపిన సమాచారం ప్రకారం డీఎస్పీ తిరుపతిరావు, గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సైలు తిరుపతి, జీనత్.. చోరీకి పాల్పడిన తీరు తెలుసుకున్నారు.

నిందితులను రిమాండ్‌కు తరలిస్తాం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా బయ్యారంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఈ ఏడాది ఫిబ్రవరి 18న జరిగిన చోరీకి పాల్పడిన ఘటనలో రాజస్థాన్‌కు చెందిన నిందితులను విచారణ అనంతరం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో గార్ల ఎస్సై జీనత్ కుమార్, సిబ్బంది, అనిల్, రంజిత్, శ్రీను పాల్గొన్నారు.